
సాక్షి గుంటూరు

ఆదివారం । 15 । జూన్ । 2025



దుర్గమ్మ సన్నిధిలో గణపతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శనివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గణపతికి విశేష పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.10 అడుగుల వద్ద ఉంది. ఇది 136.9932 టీఎంసీలకు సమానం.

నేడు వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం




దుగ్గిరాల: పసువు యార్డు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

కూటమి ప్రైవేటు ప్రేమ

ప్రభుత్వ విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోంది. సర్కారు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను చిన్నచూపు చూస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యకు పట్టం కడుతోంది. ఇటీవల అందజేసిన షైనింగ్ స్టార్ అవార్డులు దీనికి అద్దం పడుతున్నాయి. టెన్త్, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులను పక్కన పెట్టి కార్పొరేట్‌కు పెద్దపీట వేసింది.

- షైనింగ్ స్టార్ అవార్డుల్లో 'పచ్చ'పాతం
- ప్రభుత్వ విద్యార్థులను కాదని ప్రైవేటు, కార్పొరేట్‌కే పెద్దపీట వేసిన కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన 34 మంది విద్యార్థులకే పురస్కారాలు
- ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిన 116 మందికి అధిక ప్రాధాన్యత
- గుంటూరు జిల్లాలో 150 మందికి రూ. 20వేలు చొప్పున నగదు అందజేత
- జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకే పట్టం



గుంటూరు ఎడ్యుకేషన్: గత విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వం షైనింగ్ స్టార్స్‌గా ఎంపిక చేసింది. ఈనెల 9న ఒక్కొక్కరికీ రూ.20వేలు చొప్పున నగదు అందజేసింది. గుంటూరు జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న 150 మందిలో 116 మంది ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులే ఉండటం గమనార్హం. ప్రభుత్వ స్కూళ్లలో చదివిన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కేవలం 34కు పరిమితమయ్యారు. అవార్డులు అందుకున్న 112 మంది టెన్త్ విద్యార్థుల్లో ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు 85 మంది ఉండగా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 27 మందే ఉన్నారు. అదే విధంగా 38 మంది ఇంటర్ విద్యార్థుల్లో 31 మంది ప్రైవేటు, ఏడుగురు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం వారిపై సవతి తల్లి ప్రేమ చూపుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

జగనన్న పాలనలో ప్రభుత్వ విద్యార్థులకు పట్టం

జగనన్న పాలనలో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత లభించింది. విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా సత్కరించి, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సత్కరించి, నగదు ప్రోత్సాహకాలను అందించే మహత్తర కార్యక్రమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన తొలి ముగ్గురు టాపర్లకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.ఐదు వేలు చొప్పున నగదు ప్రోత్సహాలను అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో 23 మంది టెన్త్ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియెట్‌లో 15 మందితో పాటు ప్రతి ఒక్క ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసిన తొలి ముగ్గురు విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపిక చేసి వారికి వరుసగా రూ.మూడువేలు, రూ.రెండువేలు, రూ.వెయ్యి చొప్పున అందించారు. జిల్లాస్థాయిలో టాపర్లుగా నిలిచిన 23 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.15వేలు చొప్పున మొత్తం రూ.8.20 లక్షలు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

నీట్ ర్యాంకర్ల 'ఎయిమ్స్'

- జాతీయస్థాయి వైద్య విద్యాసంస్థల్లో సీటు సాధనే లక్ష్యం
- వివిధ కేటగిరీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల భావి ప్రణాళికలు

గుంటూరు ఎడ్యుకేషన్ : వైద్య విద్యా కోర్సుల జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్-2025)లో గుంటూరుకు చెందిన పలువురు విద్యార్థుల వివిధ కేటగిరీల్లో అఖిల భారతస్థాయిలో ర్యాంకులు కైవసం చేసుకున్నారు.

నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి వైద్య విద్యా సంస్థల్లో (ఎయిమ్స్)తో పాటు దేశంలోని ప్రముఖ వైద్య కళాశాలల్లో సీట్లు సాధిస్తామనే ధీమాను వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులే స్ఫూర్తి



స్వస్థలం గుంటూరు. నాన్న భానుప్రకాష్ గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జువాలజీ అధ్యాపకునిగా పని చేస్తున్నారు. అమ్మ విజయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకురాలు. నీట్ ఓపెన్ కేటగిరీలో 262 ర్యాంకు వచ్చింది. తాజాగా ర్యాంకుతో ఎయిమ్స్‌లో సీటు సాధిస్తా.

– కారుమంచి విక్రాంత్, 9వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

ఎయిమ్స్‌లో చేరడమే లక్ష్యం



స్వస్థలం యర్రగొండపాలెం. నాన్న యేసానాయక్ జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. టెన్త్ వరకూ నవోదయలో, ఇంటర్మీడియెట్ గుంటూరు వచ్చి చదివాను. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 981మార్కులు సాధించాను. తాజా ర్యాంకుతో ఎయిమ్స్‌లో చేరాలని భావిస్తున్నాను.

– రమావత్ తరుణ్ కుమార్ నాయక్, 51వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీ

అమ్మానాన్నలు ప్రభుత్వ వైద్యులే



స్వస్థలం గుంటూరు. నాన్న డాక్టర్ గోవిందనాయక్, అమ్మ డాక్టర్ కరుణ జీజీహెచ్‌లో వైద్యులు. ఓపెన్ కేటగిరీలో 2,135వ ర్యాంకు సాధించా. కళాశాలలో అధ్యాపకులు అందించిన సహకారం, సందేహాల నివృత్తి, వీక్లీ టెస్టుల ద్వారా సబ్జెక్టు పరంగా పట్టు సాధించా. ఇది మెరుగైన ర్యాంకు సాధనకు దోహదపడింది. మంగళగిరి ఎయిమ్స్‌లో చేరతా.

– ఎం. అరవింద్, 13వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీ

వైద్యురాలిగా రాణించాలనే లక్ష్యం



స్వస్థలం నరసరావుపేట. నాన్న షేక్ మహబూబ్ సుభానీ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఓపెన్ కేటగిరీలో 1,184వ ర్యాంకు సాధించా. ఎయిమ్స్‌లో చేరే లక్ష్యంతో ఉన్నాను.

– షేక్ వసీమా, 80వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్

గైనకాలజిస్ట్‌గా సేవలందిస్తా!



స్వస్థలం నెల్లూరు. నాన్న కృష్ణారెడ్డి వ్యవసాయం చేస్తున్నారు. వైద్య విద్యపై మక్కువతో రోజుకు 15 గంటల పాటు చదివాను. ప్రణాళికాబద్ధమైన కృషితోనే ఓపెన్ కేటగిరిలో 960 ర్యాంకు సాధ్యమైంది. ఎయిమ్స్‌లో వైద్యవిద్య అభ్యసించిన తరువాత గైనకాలజిస్ట్‌గా రాణించాలనే లక్ష్యంతో ఉన్నా.

– నాగిరెడ్డి మనస్విని, 49వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్

డాక్టర్‌గా సమాజానికి సేవ



స్వస్థలం గుంటూరు. నాన్న రత్నాకర్ ఆర్కిటెక్చర్. అమ్మ రెబెకా విద్య సివిల్ ఇంజినీర్. గతేడాది నీట్‌లో క్వాలిఫై అయ్యి పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో సీటు సాధించిన అన్నయ్య ప్రణయ్ విక్టర్ బాటలో వైద్య విద్య అభ్యసించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత కార్డియాలజిస్ట్‌గా ఎదిగి, సమాజానికి సేవ చేస్తా.

– సోతే ప్రేమ్ జడ్సన్ ప్రసన్న, 108వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

న్యూస్‌రీల్

వైభవంగా మల్లాది వెంకన్న శాంతి కల్యాణం



అమరావతి: మల్లాది గ్రామంలోని వట వృక్షాంతర్గత వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజల అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని పలు రకాల పుష్పమాలలు, తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తొమ్మిది మంది దంపతులతో శాంతి కల్యాణ ప్రక్రియను ఆలయ యాజ్ఞికస్వామి పరుచూరు శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీవారి ఊయల సేవ పునఃప్రారంభం



తెనాలి టౌన్ : శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో శ్రీవారి ఊయల సేవ శనివారం నుంచి పునః ప్రారంభమైంది. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడుతూ దేవస్థానంలో ప్రతి శనివారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీస్వామి, అమ్మవార్లకు ఊయల సేవ జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊయల సేవలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించారు. కొండేపి వసుంధర బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : మల్లారెడ్డి నగర్ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. రామలింగేశ్వర స్వామికి ఆలయ అర్చకులు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం రుద్రహోమం, నవగ్రహ, మండప దేవత హోమాలను చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతులు, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కొండారెడ్డి, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

జిల్లా కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



బాపట్ల: జిల్లా కోర్టు భవన సముదాయం బాపట్ల పట్టణంలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లా కోర్టు భవన సముదాయానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. తొలుత తూర్పు బాపట్లలో ఖాళీగా ఉన్న 7.5 ఎకరాల ప్రభుత్వ భూమిని, అనంతరం ఇందిరానగర్‌లో ఖాళీగా ఉన్న 2.80 ఎకరాల భూమిని పరిశీలించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భూమి స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత దస్త్రాలను పంపాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట బాపట్ల తహసీల్దార్ సలీమా, సర్వేయర్లు వీఆర్వోలు తదితరులు ఉన్నారు.



నా పేరు గరిక ఝాన్సీ...మాది కొల్లిపర. కూలిపనులకు వెళుతూ జీవనం సాగిస్తుంటాం. మాకు ముగ్గురు బిడ్డలు, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు. రెక్కల కష్టం చేస్తూనే ముగ్గురిని చదివిస్తున్నాం. ప్రభుత్వం ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీనిచ్చింది. శుక్రవారం తల్లికి వందనం పేరుతో ముగ్గురికి రూ.39 వేలు వస్తాయని ఎంతో సంబరపడ్డాం. తీరా చూస్తే ఒక్కరికీ కూడా రాలేదు. పదో తరగతి పూర్తిచేసిన ఇద్దరు పిల్లల పేర్లు లేవు. చిన్నది ప్రణతి లక్ష్మి పేరు అనర్హుల జాబితాలో ఉంది. సరైన ఆదాయ ధృవీకరణ పత్రం సమర్పించలేదని కారణం చూపారు. చాలా బాధగా ఉంది. కూలి చేసుకునే జీవించే తమలాంటి పేదలకు ప్రభుత్వ పథకాల సాయం అందకపోతే ఎలా...ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలి.

పేదింటి తల్లులకు గుండెకోత

- అర్హతలున్నా అందని 'తల్లికి వందనం'
- ప్రభుత్వ ఆంక్షలతో అనర్హత వేటు
- పథకం సాయం అందని తల్లుల్లో నిరాశ

తెనాలి: అమ్మ ఒడి పథకాన్ని పేరుమార్చి తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల సభల్లో ఇచ్చిన హామీని గతేడాది అమలు చేయనేలేదు. ప్రస్తుతం పథకం వర్తింపునకు పలు ఆంక్షలు విధించింది. ఫలితంగా ఎందరో మహిళలు అనర్హుల జాబితాలో చేరారు. సీబీఎస్ఈతోపాటు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు జాబితాల్లో కనిపించడం లేదు. 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులను పరిగణనలోకి తీసుకోలేదు. టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరితేనే వారికి లబ్ధి కలుగుతుంది. సీనియర్ ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులను అనర్హులుగా తేల్చారు. ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అంతమందికి సాయం అన్న కూటమి ప్రభుత్వ హామీ ప్రకారం తెనాలి నియోజకవర్గంలో కనీసం 30 వేల మంది విద్యార్థులకు రూ.13 వేల చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. అధికారికంగానే 22,320 మందికి మాత్రమే వర్తింపజేశారు. వీరిలోనూ చాలామంది అనర్హతతో అవకాశం కోల్పోయారు.

ఆదాయం ఉంటే పథకం దూరం

విద్యుత్ వినియోగం, నెలసరి ఆదాయాన్ని పరిశీలనలోకి తీసుకుని లబ్ధిదారుల్లో కోతను విధించినట్టు స్పష్టమవుతోంది. గ్రామీణులకు నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలకు మించిన ఆదాయం ఉంటే పథకానికి దూరమయినట్టే. విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లకు మించిన వారినీ దూరం పెట్టారు. ఇలాంటి ఆంక్షలతో తెనాలి నియోజకవర్గంలో వందల సంఖ్యలో అనర్హులుగా మారారు.

గ్రీవెన్స్‌లో పెట్టుకోమంటున్నారు



నా కుమారుడు తెనాలిలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఆరో తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం పథకానికి రేషను కార్డు సహా అన్ని అర్హతలు ఉన్నాయి. అయినప్పటికీ అర్హుల జాబితాలో పేరు లేదు. అదేమని అడిగితే గ్రీవెన్స్‌లో పెట్టుకోమని సమాధానం చెబుతున్నారు.

– బొంత శ్రీనివాసరావు, కఠెవరం

కారణం చెప్పడం లేదు



నా కుమార్తె తెనాలిలోని సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఒకటో తరగతి చదివింది. ప్రస్తుతం రెండో తరగతి. తల్లికి వందనం పథకానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఎందుకనో మా పేరు అనర్హుల జాబితాలో ఉంది. ఎందుకని అడిగితే కారణం చెప్పటం లేదు.

– కర్ర భవాని, కఠెవరం

సాయంలో కోత

తల్లుల ఖాతాల్లో రూ.13 వేల చొప్పున మాత్రమే జమచేశారు. మిగిలిన రూ.2 వేలను పాఠశాలల అభివృద్ధి నిధికి కేటాయించారు. ఆ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ల ఆధీనంలో ఉంచారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇదే విధానాన్ని అమలుచేస్తే, అప్పట్లో ప్రతిపక్షంలోని నాయకులు విమర్శలు గుప్పించారు. ఇప్పుడు ఆ బాటనే అనుసరిస్తుండటం గమనించాల్సిన అంశం.

జగన్ పాలనలో తెనాలి నియోజకవర్గంలో అందిన సాయం

సంవత్సరం	లబ్ధిదారులు	ఆర్థికసాయం
2019-2020	25,850	రూ. 38,77,50,000
2020-2021	25,471	రూ. 38,20,65000
2021-2022	21,213	రూ. 31,81,95000
2022-2023	20,857	రూ. 31,81,55,000

వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరానికి కీలకమైన శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు అతిత్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పనుల వల్ల ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ రహదారులను సిద్ధం చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రత్యామ్నాయ రహదారుల పరిశీలనలో భాగంగా శనివారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జీఎంసీ అధికారులతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్ నుంచి రెడ్డిపాలెం రోడ్డు, సంజీవయ్య నగర్ గేటు నుంచి నెహ్రూనగర్ గేటు వరకు, మూడు వంతెనలు, శారదా కాలనీ రోడ్డు, కంకరగుంట ఆర్‌యూబీ, కృష్ణానగర్ రోడ్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన పనులు జరిగే సమయంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంజీవయ్య నగర్ గేటు నుంచి నెహ్రూనగర్ గేటు వరకు ప్రస్తుతం జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కి సూచించారు. మూడు వంతెనల వద్ద రైల్వే అధికారులను సమన్వయం చేసుకొని, వర్షాలకు మురుగు నిల్వకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ గుంటూరు నగరానికి శంకర్ విలాస్ వంతెన కీలకమని, వంతెన పనులు ప్రారంభానికి ముందే ప్రత్యామ్నాయ రాకపోకల మార్గాలను జీఎంసీ నుంచి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆక్రమణలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో రక్తదానంపై అవగాహన ర్యాలీ



మంగళగిరి : రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం నిలపవచ్చని మంగళగిరిలోని ఎయిమ్స్ డైరెక్టర్ అహంతమ్ దాస్ తెలిపారు. శనివారం జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిమ్స్‌లో మెడికల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎలాంటి ప్రాణాపాయం ఉండదని ఎదుట వారి ప్రాణాలను రక్షించేందుకు ఉపయోగపడుతుందన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ 'తల్లికి వందనం'



తెనాలి టౌన్: విద్యావ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకం కింద నగదు జమ చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలిలోని జనసేన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.67లక్షల మంది తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం తాలూకు నగదు జమ అవుతున్నట్లు స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 24,65,000 మందికి అదనంగా సాయం అందుతున్నట్లు వెల్లడించారు. తెనాలి నియోజకవర్గంలో 22,383 మంది తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. పట్టణంలో 12,157 మంది, తెనాలి మండలంలో 6,748, కొల్లిపర మండలం 4,409 లబ్ధిదారులు ఉండగా మొత్తం రూ.32,07,45,000 జమ అయినట్లు చెప్పారు.

రైతుల పాలిట 'పగా'కు

ప్రత్తిపాడు: నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి దైన్యంగా ఉంది. తినీ, తినక ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర లేదు. అటు ఉన్న ధరకు తెగనమ్ముకోలేక.. ఇటు నిల్వ చేసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ధర అమాంతంగా పడి పోయింది. కొనేందుకు కంపెనీలు ముందుకు రావడం లేదు. పొగాకును ఏమి చేసుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. పంటను ఇంటికి తరలించలేక, ఎక్కడా నిల్వ చేయలేక ఇదిగో పొలాల్లోనే కట్టలు కట్టి, వానలకు తడవకుండా పొలాల్లోనే పట్టాలు కట్టి భద్రపరుచుకున్నారు. నల్లబర్లీకి ధర కాస్తంత పలకకపోతుందా..? ప్రభుత్వం అయినా స్పందించి కొనుగోలు చేయదా ? అన్న ఆశతో కళ్లలో ఒత్తులు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.



వంగిపురంలో పొలంలోనే పట్టాలు కప్పి ఉంచిన నల్లబర్లీ పొగాకు నిల్వలు



గింజుపల్లిపల్లివారిపాలెం-వంగిపురం మార్గంలో పొలాల్లోనే జాగ్రత్త చేసుకున్న పొగాకు నిల్వలు

1,38,874 క్వింటాళ్ల నిల్వ

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాల్లో 3,406 మంది రైతులు 11,704 ఎకరాల్లో నల్లబర్లీ సాగు చేశారు. 1,38,874 క్వింటాళ్ల నిల్వలున్నాయి. వ్యవసాయ వైకుంఠపాళిలో రైతును ఏటా ప్రకృతి విపత్తులు, ప్రభుత్వ వైఖర్లు నిత్యం అల్లకల్లోలం చేస్తూనే ఉన్నాయి. అయినా, మళ్లీ తొలకరి వానలు రావడం, కాడెద్దుల గంటల సవ్వడులు పిలవడం, హాలికుడి హలం పట్టి మళ్లీ కోటి ఆశల నిచ్చెనలు ఎక్కుతూ భూమిలో కాలిడటం ఆపడు.

చేనేత కార్మికులకు వేతనాల పెంపు కంటితుడుపే !

సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

మంగళగిరి టౌన్: చేనేత కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్టు మంత్రి సవిత ప్రకటించడం కంటితుడుపు చర్య మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేట్ కింద రూ. 156 కోట్లు, థ్రిఫ్ట్ ఫండ్ కింద రూ. 5 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో సహకార సంఘాలు చేనేత కార్మికులకు పని చూపించలేకపోతున్నాయని తెలిపారు. ఆప్కో సహకార సంఘాలకు 6శాతం లాభం మాత్రమే ఇస్తుందని, కొనుగోలు చేసిన వస్త్రాలకు బకాయిలు సంవత్సరాలు గడుస్తున్నా చెల్లించకపోవడంతో బ్యాంకుల వడ్డీలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వెల్లడించారు. ఇది కేవలం పాలకుల తప్పిదం తప్పా మరొకటి కాదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం బకాయిల గురించి మాట్లాడకుండా వేతనాలు పెంచుతున్నామనడం కంటితుడుపు చర్య తప్ప మరొకటి కాదని ఆయన వివరించారు. సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అండర్-19 యువకుల క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్రిమెన్ కమిటీ సారథ్యంలో అండర్-19 యువకుల జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేశామని సభ్యుడు యు.మహతీశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టుకు కోచ్ కమ్ మేనేజర్గా శివకోటి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన క్రికెటర్లు ఆదివారం మూలపాటి క్రికెట్ స్టేడియంలో సాయంత్రం 4.30 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఎంపికైన జట్టు : కె.ఎల్.శ్రీనివాస్ (కెప్టెన్), వి.పి.శ్రీనివాసరెడ్డి, వి.తరుణ్‌చౌదరి, జె.జయచంద్రకేశవ్, డి.రోణి అమూల్, ఎం.సామాన్యదత్త, వై.శశాంక్‌రెడ్డి, డి.హర్షవర్ధన్, పి.సిద్ధూ కార్తిక్‌రెడ్డి, కె.మనోహర్, ఎ.యోచన్, ఎం.తులసీ నందన్, టి.నాగసాయిచరణ్, వి.వి.రోహిత్, మన్సూర్ ఇర్ఫాన్, షేక్ అబ్దుల్ అజీజ్, స్టాండ్‌బైలుగా కె.ఎస్.వి.కౌశిక్, డి.యశ్వంత్‌కుమార్, డి.రామచంద్ర, వి.రుత్విక్, కె.ఎస్.మణికంఠ, నాగూర్‌బాషా, సీహెచ్.బింకు రామచంద్రారెడ్డి, చంద్రహాస్, ఎస్.కె.ఎం.డి.అఫ్రీద్ ఎంపికయ్యారు. వీళ్లు త్వరలో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ పోటీల్లో మహతీ శంకర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో పాత నేరస్తుడి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్. చిత్రంలో జిల్లా ఏఎస్పీ (క్రైం) సుప్రజ

రూ.30 లక్షలు విలువైన బంగారు నగలు స్వాధీనం

నగరంపాలెం: ఒంటరిగా వెళ్లే వృద్ధ మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్లే పాత నేరస్తుడ్ని గుంటూరు సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అతని నుంచి రూ.30 లక్షలు ఖరీదైన 300 గ్రాముల నగలు, బైక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాలను జిల్లా ఎస్పీ వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్ నుంచి గత నెల 28 వరకు జిల్లాలో వరుస బంగారు గొలుసు చోరీలు జరిగాయని తెలిపారు. దీంతో సీసీఎస్ సీఐలు అనురాధ, అల్తాఫ్ హుస్సేన్, బి.శ్రీనివాస్‌తో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. గత ఆరు నెలలుగా సుమారు 700 నిఘా కెమెరాలను నిశితంగా పరిశీలించామని చెప్పారు. సాంకేతిక ఆధారాలతో ఆనందపేట ఒకటో వీధిలో ఉంటున్న నలభై ఏళ్ల షేక్ అమీర్‌బేగ్ అలియాస్ జోహారీని అదుపులోకి తీసుకుని విచారించినట్లు పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎనిమిది బంగారు గొలుసు దొంగతనాలకు ఇతడే పాల్పడినట్లు విచారణలో గుర్తించామని వివరించారు. అమీర్ బేగ్‌ను అరెస్ట్ చేసి బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. మరో రెండు బైక్‌లను గుర్తించాలని చెప్పారు. కేసులను త్వరితగతిన ఛేదించిన ఏఎస్పీ క్రైం సుప్రజ, డీఎస్పీ శివాజీరాజు, సీఐలు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డులు అందించారు.

15 రోజులకు ఒకసారి చోరీ

పెయింటర్‌గా పనిచేసే అమీర్ బేగ్ ఒంటరి మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్లడంలో మంచి నేర్పరి. 2006లో మూడు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఆ తర్వాత నుంచి బంగారు గొలుసులు అపహరిస్తున్నాడు. 2014లో పాత గుంటూరు పీఎస్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో జైలుకెళ్లి వచ్చాడు. అతనిపై 2016లో పాత గుంటూరు పీఎస్‌లో సస్పెక్ట్ షీట్ ఉంది. అప్పటికే సుమారు 22 కేసులు నమోదవ్వగా, ఇటీవల చేసిన ఎనిమిది కేసులతో 30 వరకు నమోదయ్యాయి. పదిహేను రోజులకు ఒకసారి రెక్కీ చేసేవాడని, అది కూడా గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు చేసేవాడని పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ వివరించారు. బాపట్ల జిల్లా వెళ్లి అక్కడ తాళం అరిగిపోయిన బైక్‌లను దొంగలించి, ఇక్కడికి వచ్చేవాడని చెప్పారు. చోరీలు చేసిన తర్వాత ఎక్కడపడితే అక్కడే వాటిని వదిలేసి వెళ్లేవాడని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, సీఐలు జె.అనురాధ, ఎం డీ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్, బి.శ్రీనివాసరావు, పట్టాభిపురం పీఎస్ సీఐ జి.వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ సరస్వతి, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు వి.శ్రీకాంత్, ఎస్.కె.నజీర్ పాల్గొన్నారు.

అలరించిన వైద్యురాలి కూచిపూడి నృత్యం



డాక్టర్ అపర్ణ

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు రోడ్డులోని గుంటూరు వైద్యకళాశాల (జీఎంసీ) ఆవరణలోని జింఖానా ఆడిటోరియంలో శనివారం వైద్యురాలు కంభంపాటి అపర్ణ కూచిపూడి నాట్య అరంగేట్రం చేశారు. వేదాంతం కళాక్షేత్రం (యూఎస్ఏ) వ్యవస్థాపకులు వేదాంతం రాఘవ, బ్రహ్మశ్రీ కుప్పా విశ్వనాథశర్మ, బ్రహ్మశ్రీ ముప్పవరపు సింహాచలశాస్త్రి, వైద్యులు హనుమంతురావు, కంభంపాటి మహాదేవ, వరలక్ష్మి దంపతుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేదాంతం రాఘవ శిష్యురాలైన డాక్టర్ అపర్ణ కూచిపూడి రంగప్రవేశం చేశారు. సంప్రదాయ ప్రార్థనతో మొదలై, పలు కూచిపూడి నృత్యాలకు ఆమె నాట్యం చేశారు. అమెరికాలో ఉంటున్న అపర్ణ దేశ సంస్కృతిని పరిరక్షిస్తూ, తొమ్మిదో ఏటనే నాట్యం నేర్చుకోవడం ప్రారంభించిందని వక్తలు పేర్కొన్నారు. ఒకవైపు వైద్య వృత్తిని అభ్యసిస్తూ, నాట్యంపై అభిలాష పెంపొందించుకోవడం అభినందనీయమని తెలిపారు. విద్యలో రాణిస్తూ, కూచిపూడిలో ప్రతిభ చూపడం గొప్ప విషయమని కొనియాడారు.

తప్పిన పెను ప్రమాదం



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని కారంపూడి రోడ్డు సెంటర్‌లో శనివారం లారీ బీభత్సం సృష్టించింది. పిడుగురాళ్ల వైపు నుంచి అతి వేగంతో వస్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ ఇనుప గ్రిల్స్‌ని ఢీకొని దూసుకెళ్లింది. ఈ ఘటనలో 10 మీటర్ల పొడవునా ఇనుప గ్రిల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటర్‌లో లారీ బీభత్సం సృష్టించడంతో ప్రజలు పరుగులు తీశారు. గ్రిల్స్‌ను ఢీకొని లారీ నిలిచింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్రేన్ సాయంతో లారీని పక్కకు తీశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **2,800**

మోడల్ ధర రూ. **2,400**

కేంద్రియ విద్యాలయ విద్యార్థులకు అందని 'తల్లికి వందనం'

నాదెండ్ల: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని కేంద్రియ విద్యాలయ విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద సాయం అందలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై వారి తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 400 మంది ఇక్కడ చదువుతున్నారు. పాఠశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతోపాటు స్వయం ఉపాధి, ప్రైవేటు రంగాల్లో పని చేసే వారి పిల్లలు కూడా ఉన్నారు. 25 శాతం మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నప్పటికీ 'తల్లికి వందనం' వర్తించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు సైతం వర్తించిన పథకం తమ పిల్లలకు వర్తించకపోవడానికి ఏ పాపం చేశారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు నాదెండ్ల మండల విద్యాశాఖ అధికారి ఈమని కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రియ విద్యాలయాలకు ఈ పథకం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళకు ఈ సమస్యను విన్నవించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పథకం వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయకేతనం



విద్యార్థులతో డీన్స్ కిశోర్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్ : నీట్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారత స్థాయిలో వివిధ కేటగిరీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం గుంటూరులోని శ్రీచైతన్య క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు జోన్ నుంచి ఎం.అరవింద్ 13వ ర్యాంకు, జె. శ్రీ కీర్తన 109వ ర్యాంకు, ఎం.రోహన్ 133వ ర్యాంకు, షేక్ నిహాల్ పర్వేజ్ 180వ ర్యాంకు, జి. లక్ష్మీ దివ్య శ్రీ 187వ ర్యాంకు, సీహెచ్ రీతికారెడ్డి 296వ ర్యాంకు, కె.సిరివెన్నెల 847వ ర్యాంకు, వి. లిదియా జాస్మిన్ పాల్ 976వ ర్యాంకుతో పాటు ఐదువేల లోపు 41 మంది, 10వేల లోపు 83 ర్యాంకులు సహా 195 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించేందుకు అర్హత సాధించారని వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను సంస్థ అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్స్ కిషోర్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్, ఆయా క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

డేటా సమీకరణలో ఆన్‌టాలజీల పాత్ర కీలకం

మద్రాస్ ఐఐటీ సీఎస్ఈ ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్



చేబ్రోలు: వివిధ వనరుల నుంచి వచ్చిన డేటాను ఒకే ఫార్మాట్‌లో సమీకరించడానికి ఆన్‌టాలజీలు ఉపయోగపడతాయని మద్రాస్ ఐఐటీ సీఎస్ఈ ప్రొఫెసర్ పి.శ్రీనివాసకుమార్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెట్‌వర్క్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్'' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శనివారం ముగిసింది. ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఏఐ సిస్టమ్‌లు ఒక నిర్దిష్ట పరిసరాన్ని అర్థం చేసుకోవడం, నిర్ణయం తీసుకోవడం లేదా సహాయపడే విధంగా రూపొందించడంలో ఆన్‌టాలజీలు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. భాషను అర్థం చేసుకోవడంలో ముఖ్యంగా తర్జుమా, ప్రశ్నల సమాధానాలు, చాట్బాట్‌ల అభివృద్ధిలో ఉపయోగపడతాయని తెలిపారు. వాతావరణం, ట్రాఫిక్, విద్యుత్ వినియోగం వంటి డేటాను తెలివిగా ప్రాసెస్ చేయడంలో కూడా వినియోగిస్తారని చెప్పారు. జైపూర్‌లోని ఎంఎన్ఐటీ- సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ రమేష్‌బాబు బత్తుల మాట్లాడుతూ ఏఐ ఆధారిత వ్యవస్థలు బ్యాంకింగ్‌లో వినియోగదారుల ప్రవర్తనలను విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించగలవని తెలిపారు. పౌరుల భద్రతను పెంచేలా సీసీ కెమెరాలు, ట్రాఫిక్ మానిటరింగ్, ఎమర్జెన్సీ సేవలను మరింత సమర్థంగా నడిపించడంలో ఏఐ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఐటీ- సిల్చార్ అసోసియేట్ ప్రొఫెసర్ కె.సుగన్య దేవి, ఎన్ఐటీ వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ యూ.ఎస్.ఎన్. రాజు, మైక్రోసాఫ్ట్ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆదిత్య సాలాది, డీన్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

చీరాల అర్బన్: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సీపీఎం బాపట్ల జిల్లా నాయకులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. మొదటి రోజు వర్తమాన రాజకీయ పరిణామాలుపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ప్రారంభమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా సుపరిపాలన అందించినట్లు చెప్పుకుంటుందని, ప్రజలు అటువంటి సంతృప్తి వ్యక్తం చేయడం లేదన్నారు. తల్లికి వందనానికి అనేక నిబంధనలు పెట్టి కోతలు పెట్టారన్నారు. పిల్లల చదువులకు ఇచ్చే డబ్బుల్లో కోత వేయడం సరికాదన్నారు. అర్హులైన అందరికీ తల్లికి వందనం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. రాష్ట్రానికి వనరులు రాబట్టుకోవడం, విభజన హామీలు అమలుపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు భావించారన్నారు. ఆచరణలో మాత్రం ఆ ప్రయత్నం జరగలేదన్నారు. సూపర్ సిక్స్ వంటి పథకాలు ఇంటింటికీ అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తోందని తెలిపారు. జిల్లాలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రజల సమస్యలపై జిల్లాలో సీపీఎం పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణ మోహన్, ఎస్.బాబూరావు, మణిలాల్, జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, వి.వెంకటరామయ్య, ఎం.ఆంజనేయులు, తిరుమల, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి



నరసరావుపేట టౌన్: మంచినీటి పంపు వద్ద చోటు చేసుకున్న వివాదం మహిళపై కత్తితో దాడికి దారి తీసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దచెరువు రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ వద్ద కుళాయిలో తాగునీరు పట్టుకునే విషయంలో చల్లా సుధారాణికి, గుంజి తిరుమలకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సుధారాణిపై తిరుమల, అతని తండ్రి వెంకటేశ్వర్లు కత్తితో దాడికి పాల్పడ్డారు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డికి అవార్డు ప్రదానం



మంత్రి సత్యకుమార్ యాదవ్ నుంచి అవార్డు అందుకుంటున్న నరసింహారెడ్డి

లక్ష్మీపురం: తలసీమియా రోగుల కోసం 2023, 2024 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 50కి పైగా కేంద్రాల్లో భారీ రక్తదాన శిబిరాలు నిర్వహించిన సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డికి భారత రెడ్ క్రాస్ సొసైటీ ప్రతిష్టాత్మకమైన 'కార్ల్ లాండ్‌స్టీనర్ 'అవార్డు అందజేసింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు నగరంపాలెం లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నరసింహారెడ్డి నాయకత్వ నైపుణ్యం, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత నరసింహారెడ్డి మాట్లాడుతూ తమ సిబ్బంది ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా నెలకొల్పిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాల్లో 2023లో 1,440 యూనిట్లు, 2024లో 4100 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ కృషికి గానూ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తనకు గుర్తింపు కల్పించాయని తెలిపారు. ఇప్పుడు ఈ అవార్డు అందుకోవడం ద్వారా రక్తదాన సేకరణలో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎ.కె.పరీద మాట్లాడుతూ రక్తదాన శిబిరాల ఏర్పాటు, సామాజిక సేవల్లో నరసింహారెడ్డి అందించిన అసాధారణ సేవలకు గుర్తింపుగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు పి.రామచంద్రరాజు, జీఎస్టీ అధికారులు నాగరాజు, రవికుమార్, ఈశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, పూర్ణ సాయి, శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

యడ్లపాడు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. హైవే పరిరక్షణ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా వలపర్ల గ్రామస్తులు మొహమ్మద్, హసీరా దంపతులు, వారి ఇద్దరు పిల్లలు నహీరా, నసీర్‌లతో బైక్‌పై శనివారం గుంటూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా, యడ్లపాడు సమీపంలోని నక్కవాగు వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. వాహనం అదుపు తప్పి కిందపడగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొన్న వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. గాయపడిన వారిని హైవే అంబులెన్స్ సిబ్బంది గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా బైక్‌పై గుంటూరు వైపు ప్రయాణమయ్యాడు. మద్యం సేవించి ఆపై వేగంలో ఉన్నందున వాహనం అదుపుతప్పి యడ్లపాడు ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. బాషా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది బాధితుడిని గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సూపర్ 'సఫారీ'

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా



దక్షిణాఫ్రికా సుదీర్ఘ స్వప్నం నెరవేరింది...ఐసీసీ ట్రోఫీ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా పోరాడిన టీమ్ ఎట్టకేలకు ఆ లక్ష్యాన్ని చేరుకుంది...1998లో ఐసీసీ నాకౌట్ కప్ సాధించిన తర్వాత 7 వన్డే వరల్డ్ కప్‌లు, 9 టి20 వరల్డ్ కప్‌లు, 9 చాంపియన్స్ ట్రోఫీలు, 2 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లు జరగ్గా... ఒక్క సారి కూడా టైటిల్ అందుకునే అవకాశమే రాలేదు... అద్భుతంగా ఆడుతూ వచ్చి అసలు సమయంలో చేతులెత్తేసిన సందర్భాలు కొన్నయితే, అవసరమైన చోట అదృష్టం మొహం చాటేసిన సందర్భాలు మరికొన్ని... ఇప్పుడు ఆ 'చోకర్స్' ముద్రను వెనక్కి తోస్తూ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో సఫారీ టీమ్ సంబరాలు చేసుకుంది. ఆసక్తికరంగా సాగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి బవుమా సేన సగర్వంగా సత్తా చాటింది. ఐసీసీ టోర్నీ ఫైనల్ అంటే చెలరేగిపోయే ఆసీస్ ఈ సారి మాత్రం బ్యాటింగ్ వైఫల్యంతో తలవంచి నిరాశగా వెనుదిరిగింది.

- 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సొంతం
- ఫైనల్లో 5 వికెట్లతో ఆస్ట్రేలియాపై ఘన విజయం

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో దక్షిణాఫ్రికా చాంపియన్‌గా నిలిచింది. శనివారం ముగిసిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 213/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 83.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎయిడెన్ మార్క్‌రమ్ (207 బంతుల్లో 136; 14 ఫోర్లు) దాదాపు చివరి వరకు నిలబడి జట్టును గెలిపించాడు. న్యూజిలాండ్ (2021), ఆస్ట్రేలియా (2023) తర్వాత డబ్ల్యూటీసీ గెలుచుకున్న మూడో టీమ్‌గా దక్షిణాఫ్రికా నిలిచింది. విజేత దక్షిణాఫ్రికాకు రూ. 30.76 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది.

27.4 ఓవర్లలో 69 పరుగులు...

ఆట ఆరంభంలోనే తెంబా బవుమా (134 బంతుల్లో 66; 5 ఫోర్లు)ను కమిన్స్ అవుట్ చేయగా, కొద్ది సేపటికే స్టబ్స్ (8)ను స్టార్క్ బౌల్డ్ చేశాడు. ఆ సమయంలో దక్షిణాఫ్రికా మరో 41 పరుగులు చేయాల్సి ఉండటంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో వైపు మార్క్‌రమ్ మూడో రోజు తరహాలోనే పట్టుదలగా ఆడుతూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. అతనికి బెడింగ్‌హామ్ (21 నాటౌట్) అండగా నిలిచాడు. ఎట్టకేలకు కొత్త బంతిని తీసుకున్న వెంటనే తొలి ఓవర్లోనే మార్క్‌రమ్‌ను హాజల్‌వుడ్ వెనక్కి పంపించినా...అప్పటికే ఆలస్యమైపోయింది. విజయానికి మరో 5 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా, స్టార్క్ వేసిన బంతిని వెరీన్ కవర్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీయడంతో సఫారీ శిబిరంలో వేడుక మొదలైంది.

స్కోరు వివరాలు: **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 138; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 207; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) హెడ్ (బి) హాజల్‌వుడ్ 136; రికెల్టన్ (సి) క్యారీ (బి) స్టార్క్ 6; ముల్డర్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 27; బవుమా (సి) క్యారీ (బి) కమిన్స్ 66; స్టబ్స్ (బి) స్టార్క్ 8; బెడింగ్‌హామ్ (నాటౌట్) 21; వెరీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (83.4 ఓవర్లలో 5 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-9, 2-70, 3-217, 4-241, 5-276. **బౌలింగ్:** స్టార్క్ 14.4-1-66-3, హాజల్‌వుడ్ 19-2-58-1, కమిన్స్ 17-0-59-1, లయన్ 26-4-66-0, వెబ్‌స్టర్ 5-0-13-0, హెడ్ 2-0-8-0.


కుమారుడితో బవుమా సంబరం

చోకర్స్ కాదు... విన్నర్స్

దాదాపు ఏడాది క్రితం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో టి20 వరల్డ్ కప్ ఫైనల్లో తలపడింది. 177 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో చేతిలో 6 వికెట్లతో 30 బంతుల్లో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. ఇక విజయం లాంఛనమే అనిపించగా...చివరకు 7 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. డగౌట్‌లో కూర్చుకున్న కెప్టెన్ మార్క్‌రమ్ కన్నీళ్లపర్యంతమైన దృశ్యం దక్షిణాఫ్రికా అభిమానులకు కలచివేసింది. ఇప్పుడు సంవత్సరం తిరగక ముందే అతను సఫారీ ఫ్యాన్స్ దృష్టిలో హీరోగా మారిపోయాడు. ఆస్ట్రేలియా 'బౌలింగ్ చతుష్టయం'ను ఎదుర్కొని దక్షిణాఫ్రికా 282 పరుగులు సాధించగలదా అనే సందేహాల మధ్య అతను అసాధారణ బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 'డకౌట్' అయినా రెండో ఇన్నింగ్స్‌లో ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పట్టుదలగా తన కెరీర్‌లో అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కెప్టెన్ తెంబా బవుమా విజయగాథ కూడా ఇలాంటిదే. 64 టెస్టుల కెరీర్‌లో కేవలం 4 సెంచరీలే సాధించిన అతను ప్రతీసారి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నాడు. 'బ్లాక్ ఆఫ్రికన్' కాబట్టి టీమ్‌లో చోటు దక్కిందని, రిజర్వేషన్ కారణంగానే కొనసాగుతున్నాడని వ్యాఖ్యలు వినిపిస్తూ వచ్చాయి. తాజా ఘనతతో బవుమా నాయకుడిగా ఆకాశమంత ఎత్తున నిలిచాడు. ఫైనల్‌కు ముందు తన కెప్టెన్సీలో ఆడిన 9 టెస్టుల్లో 8 మ్యాచ్‌లు గెలిపించి ఓటమి ఎరుగని అతను...ఇప్పుడు టీమ్‌ను వరల్డ్ చాంపియన్‌గా నిలిచి పొట్టివాడు అయినా గట్టివాడే అని నిరూపించాడు. మార్క్‌రమ్, బవుమా 147 పరుగుల భాగస్వామ్యం ఆస్ట్రేలియా ఆట కట్టించేలా చేసింది. డ్రగ్స్ వివాదం నుంచి బయటపడిన రబాడ 9 వికెట్లతో సఫారీ విజయానికి పునాది వేయగా, రెండో ఇన్నింగ్స్‌లో ఇన్‌గిడి తన విలువ చాటాడు.

విమర్శలను అధిగమించి...

దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించినా...ఆ జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఎదురుగా బలమైన ఆస్ట్రేలియాలాంటి ప్రత్యర్థి ఉండటంతో పాటు టీమ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. టాప్-7 బ్యాటర్లతో పాటు ఆల్‌రౌండర్ యాన్సెన్ మొత్తం టెస్టు పరుగులు కలిపినా... ఒక్క స్టీవ్ స్మిత్ సాధించిన పరుగులకంటే తక్కువగా ఉన్నాయి! పైగా స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, లయన్ కలిసి ఆసీస్‌కు ఎన్నో అద్భుత విజయాలు అందించారు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కొని గెలవడం దాదాపు అసాధ్యమని అనిపించింది. అన్నింటికి మించి సఫారీ టీమ్ ఫైనల్‌కు చేరిన క్రమంపై విమర్శలు ఉన్నాయి. 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రశ్రేణి టీమ్‌లైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను ఒక్క టెస్టులోనూ ఎదుర్కోని టీమ్... సొంతగడ్డపై భారత్ చేతిలో 55కు ఆలౌటై చిత్తుగా ఓడింది. వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లాంటి బలహీన ప్రత్యర్థులపై (వరుసగా 7 టెస్టులు) గెలిచి ఫైనల్ చేరిందని వ్యాఖ్యలు వచ్చాయి. అయితే ఫైనల్‌కు ముందు 'అదంతా మా చేతుల్లో లేదు. ఈ ఒక్క మ్యాచ్ గెలిస్తే దానిని ఎవరూ పట్టించుకోరు' అంటూ స్పష్టంగా చెప్పిన బవుమా దానిని చేసి చూపించాడు. ఆస్ట్రేలియాను ఓడిస్తేనే వరల్డ్ చాంపియన్‌గా భావిస్తాం అనేవారికి సమాధానం ఇచ్చాడు. స్వదేశంలో టి20 లీగ్ కోసం ప్రధాన ఆటగాళ్లతో కాకుండా ద్వితీయ శ్రేణి జట్టును న్యూజిలాండ్ పంపగా 0-2తో టీమ్ చిత్తయింది. అయినా సరే చివరకు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టు అర్హత సాధించడం విశేషం.

ఆనందం దక్కింది...

అంతర్జాతీయ క్రికెట్‌లోకి 1991లో దక్షిణాఫ్రికా పునరాగమనం చేసింది. ఆ తర్వాత 1992 వరల్డ్ కప్ సెమీస్‌లో వర్షం నిబంధనతో ఓడిన జట్టు, 1996లో అన్ని లీగ్‌లు గెలిచి క్వార్టర్స్‌లో అనూహ్యంగా ఓడింది. 1998తో క్రానే, కలిస్, రోడ్స్, బౌచర్‌లతో కూడిన జట్టు తొలి చాంపియన్స్ ట్రోఫీని గెలిచి ఆనందం పంచింది. అయితే ఆ తర్వాతే జట్టు రాత పూర్తిగా మారిపోయింది. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌కు ముందు వరకు ఒక్క ఐసీసీ టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయింది. 1999 సెమీస్‌లో 'టై'తో గుండె పగలగా, సొంతగడ్డపై 2003లో మళ్లీ వర్షంతో లెక్క తప్పడంతో సెమీస్ కూడా చేరలేకపోయింది. ఆ తర్వాత మూడు సార్లు సెమీస్ వరకు చేరడంలో సఫలమైంది. స్వదేశంలో 2007 టి20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరని జట్టు తర్వాత రెండు సార్లు సెమీస్‌లోనే ఓడింది. చాంపియన్స్ ట్రోఫీలో ఐదు సార్లు సెమీస్‌కే పరిమితమైంది. వేర్వేరు కారణాలతో వచ్చిన ఈ ఓటములతో టీమ్‌లో నైరాశ్యం నెలకొంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా బోర్డులో రాజకీయాలు, ఆర్థిక సంక్షోభం తదితర కారణాలతో జట్టు ఆటపై కూడా ప్రభావం పడింది. వరుస ఓటములతో టీమ్ వెనుకబడిపోవడంతో ఇతర టీమ్‌ల దృష్టిలో అది ద్వితీయ శ్రేణి జట్టుగా మారిపోయింది. అయితే తాజా విజయం సఫారీ టీమ్‌లో కొత్త ఉత్సాహం తీసుకురానుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కూడా అక్కడే జరగనున్న నేపథ్యంలో ఈ విజయం వారిలో జోష్ నింపడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

బర్త్ డే స్పెషల్


'లెనిన్'లో శ్రీలీల

దక్షిణాదిలోని యంగ్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్నారు శ్రీలీల. తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ చిత్రాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ పుట్టిన రోజు జూన్ 14న. ఈ సందర్భంగా తెలుగులో ఆమె నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్, మాస్ జాతర, లెనిన్' సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ రిలీజ్ చేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. అలాగే 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ-హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పై మూడు సినిమాల నుంచి శ్రీలీల బర్త్ డే స్పెషల్ పోస్టర్స్ విడుదల అయ్యాయి.

అందుకే లా చదువుతున్నాను

- హీరోయిన్ అనంతిక



''ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో స్క్రీన్‌పై సంప్రదాయంగానే ఎక్కువగా కనిపించాను.అలాగని గ్లామర్ పాత్రలు చేయనని కాదు. నేనొక ఆర్టిస్టుని. కథ డిమాండ్ చేస్తే ఇంటిమేట్ సీన్స్‌లో నటించడానికి నాకు అభ్యంతరం లేదు. కానీ ఆ సీన్స్ నా పాత్రకు, సినిమాలకు ఉపయోగపడేలా ఉండాలి'' అని హీరోయిన్ అనంతికా సనీల్ కుమార్ అన్నారు. అనంతికా సనీల్ కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అనంతిక మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో శుద్ధి యోగ్య అనే పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్ర దృష్టి కోణం నుంచి ఈ కథ సాగుతుంది. ఓ అమ్మాయి జీవితంలో 17 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల వరకు జరిగిన కొన్ని సంఘటనలను '8 వసంతాలు' సినిమాగా చూపిస్తున్నాం. ఫణీంద్రగారు చెప్పిన ఈ సినిమా కథ విన్నప్పుడు నాకు, మా అమ్మకు కన్నీళ్లొచ్చాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలతో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే యాక్టింగ్ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలనుకుంటున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. చెప్పాలంటే నేను అనుకోకుండానే నటి అయ్యాను. లాక్‌డౌన్ సమయంలో పెద్దగా పని దొరకలేదు. ఆ సమయంలో ఆలాంటి ఆలోచనలు వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో కరాటే, మార్షల్ ఆర్ట్స్ కూడా నేను నేర్చుకున్నాను. ప్రస్తుతం నేను 'లా' చదువుతున్నాను. భవిష్యత్తులో రాజకీయ నాయకురాలిని అవ్వాలనుకుంటున్నాను. అందుకే 'లా' చదువుతున్నాను'' అని చెప్పారు.

మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఫ్రీడమ్

- హీరో తేజ సజ్జా

'చూడాలని ఉంది, కలిసుందాం రా, గంగోత్రి, ఛత్రపతి' తదితర చిత్రాలతో బాల నటుడిగా ప్రేక్షకులకు దగ్గరై, 'ఓ బేబీ'తో లీడ్ యాక్టర్‌గా మారి, ఆ తర్వాత చేసిన 'జాంబిరెడ్డి'తో ఆకట్టుకున్నారు తేజ సజ్జా. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ 'ఫాదర్స్ డే' గురించి 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...



- నాకు ఊహ తెలిసినప్పట్నుంచి మా నాన్నగారు వృత్తి రీత్యా బిజీగా ఉండేవారు. కానీ ఆదివారం మాత్రం నన్ను కూడా తనతో పాటు ఆఫీస్‌కు తీసుకుని వెళ్లేవారు. అక్కడ అందరూ పని చేస్తుంటే ఆసక్తిగా గమనించేవాడిని. అలా వెళ్లడం వల్లనో ఏమో నా ఆరేళ్ల వయసుకే స్కూలు, సినిమా షూటింగ్‌లు వంటి పరిసరాల్లో నేను చాలా మామూలుగా ఉండగలిగాను. ఎలాంటి బెదురు లేకుండా షూటింగ్ చేసేవాణ్ణి.
- నా అల్లరి విషయానికొస్తే... ఒకసారి స్కూల్ నుంచి మా నాన్నగారికి ఫోన్ చేసి, 'మీ అబ్బాయి బాగా అల్లరి చేస్తున్నాడు' అని కంప్లైంట్ చేశారు. నాన్న చాలా కూల్‌గా... 'వాడిని పెంచింది నేను. ఏం చేస్తాడో, ఏం చెయ్యడో నాకు బాగా తెలుసు. మీరేం చెప్పినా నమ్మను. వాడిని అడగను కూడా' అని ఫోన్ కట్ చేశారు. నాన్న అంత నమ్మారు కాబట్టి అప్పట్నుంచి ఈరోజు వరకూ నా వల్ల ఆయనకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా జాగ్రత్తగా, క్రమశిక్షణతో ఉంటున్నాను.
- నాన్నకి నేనంటే చాలా నమ్మకం. నా ఇష్టాయిష్టాలకు, నా నిర్ణయాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. చదువు, సినిమాలు... ఇలా నన్ను అన్ని విషయాల్లోనూ ప్రోత్సహించారు. యాక్చువల్లీ నాన్నకు మొదట్లో సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. ఒకటి, రెండు సినిమాలు అయ్యాక నేను షూటింగ్స్‌ను పిక్నిక్‌లా ఎంజాయ్ చేస్తున్నానని నన్ను వెళ్లనిచ్చారు. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ అయ్యాక ధైర్యం చేసి, నాన్న దగ్గరికి వెళ్లి, 'ఈ చదువు నా వల్ల కావడం లేదు. సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను' అనగానే టీవీ చూస్తున్న నాన్న కనీసం తల కూడా తిప్పకుండా 'సరే నీ ఇష్టం' అన్నారు. అలా ఒక్క మాట కూడా అడగకుండా నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేలా ప్రోత్సహించే సరికి, ఒక బాధ్యతలా భావించి, పట్టుదలతో పని చేస్తున్నాను.
- నాకు పదేళ్లు వచ్చేసరికి మా నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా బిహేవ్ చేయడం మొదలు పెట్టారు. అన్ని రకాల పనులు, విషయాల్లో నా ఒపీనియన్ అడిగి తెలుసుకునే వారు. ఏదైనా నిర్ణయం తీసుకునే విషయంలో నా అభిప్రాయానికి కూడా విలువ ఇచ్చేవారు. నేను చాలా బాధ్యతగా ఉండటానికి అది చాలా ఇన్‌స్పైర్ చేసింది.
- నా లైఫ్‌లో మా నాన్నే నా హీరో. ఒక మామూలు వ్యక్తిగా లైఫ్ స్టార్ట్ చేసి, తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగారు. కుటుంబంలో ఉన్న అందరి బాధ్యతలతో పాటు... బంధువుల్లో ఎంతో మందికి చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి వాటికి హెల్ప్ చేశారు.
- మా నాన్నకు కుటుంబం తప్ప వేరే వ్యాపకం లేదు. ఆఫీసు, ఇల్లు, కుటుంబం... ఇదే ఆయన లోకం. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావం ఎలా ఉండాలో నాన్నగారి నుండి నేర్చుకున్నాను. మనం చేసే పనికి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యాలని నేర్చుకున్నాను. అలాగే లైఫ్‌లో జరిగే ప్రతీ విషయం గురించి అదే పనిగా ఆలోచించకుండా 'ప్రశాంతంగా ఉండటం' అనేది మా నాన్న నుంచి నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను.
- నాన్న నాతో చెప్పే చిన్న చిన్న మాటలే నాకు లోతైన అవగాహన కలిగిస్తాయి. నా కెరీర్ పరమైన, రోజువారీ విషయాల్లో ఆయన కలుగజేసుకోరు. కానీ ఎదుటి వ్యక్తి నొచ్చుకోకుండా ఎలా సాఫ్ట్‌గా మాట్లాడాలో, మనం చెప్పే మాట ఎదుట వ్యక్తికి సులువుగా అర్థమయ్యేలా ఎలా మాట్లాడాలో అప్పుడప్పుడు చెబుతుంటారు.
- నా లైఫ్‌లో మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ అంటే... చాలా చిన్న వయసులోనే నాకు సంబంధించినవి నేనే ఎంచుకునే ఫ్రీడమ్. వీటివల్లే నేను సొసైటీలో తిరిగి, చాలామంది వ్యక్తులను కలిసి, అన్ని రకాల పరిస్థితులను దగ్గరగా చూసి, ఆలోచించి, అందుకు తగ్గట్టు ప్రవర్తించడం నేర్చుకున్నాను. సినిమా షూటింగ్, ఇతర పనులతో ఎంత బిజీగా ఉన్నా నాన్నతో కూర్చుని మాట్లాడతాను. అయితే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు వరుస సినిమాల వల్ల నిజంగానే నాన్నగారితో ఎక్కువ టైమ్ గడపడానికి కుదరడం లేదు. అదో చిన్న లోటులా అనిపిస్తుంటుంది.
- మా నాన్నగారికి ఇప్పుడు 64 ఏళ్లు. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి, గంట వాకింగ్ చేస్తారు. తర్వాత ఆఫీసుకు వెళ్లడం. గత 30 ఏళ్లుగా ఇదే దినచర్య. నాకు క్రమశిక్షణ ఉంది కానీ... ఇలాంటి క్రమశిక్షణను అలవాటు చేసుకోవడానికి ట్రై చేస్తున్నాను.
- మా నాన్నగారి 60వ పుట్టినరోజు సందర్భంగా నా సంపాదనతో ఆయనకి ఒక మంచి కారు కొని, గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పుడు ఆయన చాలా సంతోషించారు. ఈ 'ఫాదర్స్ డే'కి మా నాన్నగారికి నేను ఇచ్చే గిఫ్ట్ అంటే 'సాక్షి'కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూనే. మా నాన్నగారు ఈ ఇంటర్వ్యూ చదివి, ఇచ్చే రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.


విష్ణు మంచు

శివయ్యా అని మనసారా పిలువు...

''దేవుడు లేడు... గీవుడు లేడు. అది ఒట్టి రాయి' అనే డైలాగ్‌తో ప్రారంభమైంది 'కన్నప్ప' సినిమా తెలుగు ట్రైలర్. మంచు విష్ణు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఎమ్. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''ఆ తిన్నడు సామాన్యుడు కాదు... అతడ్ని దాటి వాయులింగాన్ని చేరడం అసాధ్యం', 'వాయులింగం మీద దుర్మార్గుల చూపు పడింది', 'ఈ వాయులింగం రహస్యాన్ని కాపాడటానికి నా ప్రాణాలను సైతం అర్పిస్తాను', 'ఈ గూడెంలో ఏ బిడ్డకు ఆపద రానివ్వను ఇది నా ఆన. తిన్నడి ఆన', 'ఇలాండివాడు మీకు గొప్ప భక్తుడు అవుతాడని మీకు నమ్మకం ఏంటి ప్రభు', 'నీతో పాటే నేను ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నాను... రుద్ర', 'ఎవరు నువ్వు... ఆ పెద్దోళ్లందరికంటే నేనే పెద్దోణ్ణి', 'నన్ను మించిన శివ భక్తుడా... ఈ సృష్టిలో లేడు', 'శివయ్యా అని మనసారా పిలువు..' అనే డైలాగ్స్ 'కన్నప్ప' ట్రైలర్‌లో ఉన్నాయి.